అండగా ఉంటా.. అభివృద్ధి చేస్తా !


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి నరేందర్‌ముదిరాజ్

మణికొండ: నియోజకవర్గంలోని ప్రతి కాంగ్రెస్ నాయకునికి, కార్యకర్తకు అండగా ఉండటంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడినందుకు ఎవ్వరు అధైర్యపడవద్దని, ప్రభుత్వం తమదే వచ్చినందున ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుద్దామన్నారు. రాబోయే రోజుల్లో వచ్చే ఎంపీ, సర్పంచ్, మున్సిపల్, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటడంతో పాటు నాయకులకు పదవులు వచ్చేలా తన వంతు కృషి చేస్తానన్నారు. గత 15 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి రాబోయే ఐదేళ్లలో చేసి చూపిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ, నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్ మున్సిపాలిటీల అధ్యక్షులు జితేందర్, అశోక్‌యాదవ్, కృష్ణారెడ్డి, శేఖర్, కౌన్సిలర్‌లు, డివిజన్‌ల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుని గెలిపించారు


వై.సంజీవ రెడ్డి (వైఎస్సార్)

రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకున్నారని అందుకే కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ స్థానాల్లో విజయం అందించారని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు వై.సంజీవ రెడ్డి (వైఎస్సార్) వెల్లడించారు. తన నివాసంలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఒక మంచి నిర్ణయాత్మకమైన మార్పు కోరుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మంచి పాలనను అందిస్తుందని తెలిపారు. రెండుసార్లు అధికారం ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ ప్రజల మెప్పు పొందలేదని సంక్షేమ పథకాలను కొందిరికి ఇచ్చి ఎంతో చేశామని వెల్లడించుకోవడంతో ప్రజలు చీకరించారని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలందరికి తగిన న్యాయం జరుగుతుందని అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీల మద్దతు బీఆర్‌ఎస్‌కే !

- సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్‌లలో మొగ్గు
- రెండు డివిజన్‌లలో 14,536 ఓట్లు
- నియోజకవర్గ వ్యాప్తంగా మరో 10,000



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ప్రకాష్‌గౌడ్

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న ముస్లిం మైనార్టీ ఓట్లు నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద మొత్తంలో బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపాయి. 2018 ఎన్నికల్లోనూ వారిలో అత్యధికంగా బీఆర్ఎస్‌కే ఓటు వేసినా.. ఇటీవల కర్ణాటకలో మైనార్టీలంతా కాంగ్రెస్‌కు ఓటు వేశారనే ప్రచారం జరిగింది. దీంతో అప్రమత్తమైన బీఆర్ఎస్, దాని మిత్రపక్షం ఎంఐఎం పార్టీలు చతురత ప్రదర్శించి వారి ఓట్లను కాంగ్రెస్ వైపు వెళ్లకుండా నిరోధించగలిగారు.

- రాజేంద్రనగర్ నియోజకవర్గమే కాకుండా శేరిలింగంపల్లి, మహేశ్వరం, ఎల్బీనగర్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్ తదితర నియోజకవర్గాల్లో వారి ఎత్తుగడ ఫలించింది. దాంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధి వరకు కాంగ్రెస్ పార్టీకి ఒక్కసీటు రాలేదని రాజకీయ పండితులు పేర్కొన్నారు.
- నియోజకవర్గంలో గొలిదొడ్డి నుంచి ప్రారంభమైన కౌంటింగ్‌లో ఎంఐఎంకు నామమాత్రంగానే ఓట్లు వచ్చాయి. గ్రేటర్ పరిధిలోని శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లలో తమకే అత్యధిక ఓట్లు పోలవుతాయని ఎంఐఎం పార్టీ నాయకులు ఆశించారు. పడితే తమకు లేదంటే బీఆర్ఎస్ పార్టీకి పడాలని తమ ఎత్తుగడ ప్రకారంగానే ఓటర్లు స్పందించారు. దీంతో 9వ రౌండ్‌గా వెలువడిన అత్తాపూర్ డివిజన్ ఫలితాల్లో ఎంఐఎం పార్టీకి నామమాత్రంగా 106 ఓట్లు రాగా.. బీఆర్ఎస్‌కు 5,226, బీజేపీకి 8,285, కాంగ్రెస్‌కు 2,276 ఓట్లు వచ్చాయి.
- 10వ రౌండ్ సులేమాన్‌నగర్ డివిజన్ ఫలితాల్లో ఎంఐఎంకు 6,002, బీఆర్ఎస్‌కు అత్యధికంగా 6,934, కాంగ్రెస్‌కు 2,493, బీజేపీకి 849 ఓట్లు మాత్రమే వచ్చాయి.
- 11వ రౌండ్ శాస్త్రిపురం డివిజన్‌లో ఎంఐఎంకు 5,344, బీఆర్ఎస్‌కు 7,602, కాంగ్రెస్‌కు 2,585, బీజేపీకి 89 ఓట్లుగా వచ్చాయి.
- మైలార్‌దేవ్‌పల్లిలోని కొన్ని బూత్‌లతో కలిపి 12వ రౌండ్‌లో ఎంఐఎం పార్టీకి 2,943, బీఆర్ఎస్‌కు 6,002, కాంగ్రెస్‌కు 3,365, బీజేపీకి 2,984 ఓట్లు వచ్చాయి.
- ప్రధానంగా 10, 11వ రౌండ్‌ల ఫలితాలను గమనిస్తే ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీల కన్నా అధికంగా బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేశారని స్పష్టం అవుతుంది.
- మైనార్టీల ప్రచారం జరిగినట్టు కాంగ్రెస్‌కు వేసినా.. తమ పార్టీకి భావించి ఎంఐఎంకు వేసినా నియోజకవర్గ ఫలితం మరోలా ఉండేదని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
- మైనార్టీలు బీఆర్ఎస్‌కు అండగా నిలవడంతోనే నగర శివారు నియోజకవర్గాలు, ముఖ్యంగా ముస్లింలు అధికంగా ఉండే నియోజకవర్గాలు బీఆర్ఎస్ వశం అయ్యాయని వారు చెబుతున్నారు.

9 నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఆధ్వర్యంలో శారీస్ ఆఫ్ ఇండియా పేరిట చేనేత వస్త్ర ప్రదర్శనను ఈ నెల 9 నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు తెలిపారు. నాణ్యమైన, ఎక్కడా దొరకని బెనారస్ పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చేనేత కళాకారుల కళా ఉత్పత్తులైన సిల్క్, కాటన్ వస్త్రాలతో పాటు డిజైనరీ చీరలు, ఫ్యాన్సీ వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. నాణ్యతకు మారుపేరైన సిల్క్ గ్యాలరీలోని వస్త్రాలను మహిళలు సందర్శించాలని కోరారు.

ఒంటె మాంసం విక్రయించేందుకు యత్నించిన ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్: హకీంపేట కుంట సమీపంలో ఒంటె మాంసాన్ని అమ్మేందుకు ఏడు ఒంటెలను ఓ ప్రాంతంలో ఉంచగా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి ఒంటెలకు విముక్తి కలిగించారు. నిందితులను ఫిలింనగర్ పోలీసులకు అప్పగించారు. వివరాలివీ... పారామౌంట్ కాలనీ సమీపంలో మహ్మద్ ఇస్మాయిల్(30) బెస్ట్‌బీఫ్ షాప్ నిర్వహిస్తున్నాడు. తేలికగా డబ్బు సంపాదించేందుకు ఒంటె మాంసాన్ని విక్రయించాలని తన అనుచరులు మహ్మద్ సల్మాన్, సిరాజ్‌ఖాన్‌తో పథకం వేశారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి ఒంటెలను తీసుకొచ్చి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దాడులు నిర్వహించి నాలుగు ఒంటెలతో పాటు కత్తులు, తూనికల యంత్రాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఒంటె మాంసాన్ని విక్రయించేందుకు యత్నించిన నిందితులు


ఎంటేరువాగు వంతెన కింద పేరుకుపోయిన వ్యర్థాలు

వాగుల్లో వ్యర్థాల పారబోత..

- కలుషితమవుతోన్న జలాలు
- పట్టించుకోని అధికారులు

శంషాబాద్ రూరల్: వాగుల్లో ఇష్టానుసారంగా వ్యర్థాలను పారబోస్తుండడంతో నీళ్లు కలుషితమవుతున్నాయి. ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలతో కాలువలు మూసుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని ఎంటేరు, ఈసీ వాగుతో పాటు గ్రామాల పరిసరాల్లోని వరద కాలువల్లో ఎక్కడ చూసిన వ్యర్థాలు కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల చెరువులు, కుంటల్లో సైతం వ్యర్థాలను పారబోస్తుండడం ఆందోళన కల్గిస్తుంది.

ఎంటేరువాగులో..

పాల్మాకుల మైసమ్మ చెరువు అలుగు నుంచి వరద ఎంటేరువాగు గుండా సుల్తాన్‌పల్లి శివారులో ఈసీ వాగులో కలుస్తుంది. కాచారం సమీపంలో షాబాద్ రహదారిలో ఎంటేరువాగుపై వంతెన ఉంది. ఈ వంతెనకు రెండు వైపులా ఎక్కడ చూసినా నీళ్లల్లో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. వంతెన కింద తూముల్లో వ్యర్థాలు పేరుకుపోయి వరదనీటికి ఆటంకంగా మారింది. రహదారిలో ఉన్న వంతెనపై నుంచి వ్యర్థాలను పారబోస్తున్నారు. ననాజీపూర్ శివారు నుంచి పారుతున్న ఈ ఎంటేరువాగులో వ్యర్థాలను ప్లాస్టింగ్ సంచుల్లో నింపిపడేస్తున్నారు.


కాచారం వద్ద ఎంటేరువాగులో పారబోసిన వ్యర్థాలు

ఈసీవాగులో..

కేబీ.దొడ్డి, కవేలిగూడ శివారులో ఉన్న ఈసీవాగు వంతెనలపై నుంచి వ్యర్థాలను నీళ్లల్లో వేస్తున్నారు. ఇక్కడ వినాయక చవితి సందర్భంలో వినాయకుడు విగ్రహాలను సైతం నిమజ్జనం చేస్తుంటారు. దీంతో పాటు వ్యర్థాలు కూడా వేస్తుండడంతో నీళ్ల కలుషితమవుతున్నాయి. ప్రస్తుతం ఈ వాగుల్లో వరదనీరు పారుతుండగా ఈ నీళ్లు హిమాయత్‌సాగర్ జలాశయానికి చేరుతాయి.

చెత్త సేకరణ కొనసాగిస్తున్నా..

పంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటి తిరిగి చెత్తను సేకరిస్తున్నా.. చాలా మంది చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్డు పక్కన లేదంటే వాగులు, కాలువల్లో పారబోస్తున్నారు. పంచాయతీలు కూడా సేకరించిన పొడి చెత్తను చాలా చోట్ల ఎక్కడపడితే అక్కడ పారేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.


కేబీ.దొడ్డి వద్ద ఈసీవాగులో వ్యర్థాలు

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నాయకత్వంలోనే అభివృద్ధి


పూలపల్లి రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ నాయకత్వంలో మరింత అభివృద్ధి కానుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ 4వసారి భారీ మెజార్టీతో గెలుపొందేందుకు కష్టపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే విజయానికి అహర్నిశలు పాటుపడి కష్టపడి పని చేసిన పూలపల్లి రాజేందర్ రెడ్డిని సోమవారం కార్పొరేషన్ నాయకులు, కార్యకర్తలు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలపల్లి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గెలుపును ప్రజలంతా తమ సొంత గెలుపుగా భావిస్తున్నారన్నారు. ఆయన గెలుపును పురస్కరించుకొని ప్రజలంతా స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి బాణాసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, సీనియర్ నాయకులు మద్దెల ప్రేమ్‌కుమార్‌గౌడ్, యాదిరెడ్డి, రాజిరెడ్డి, దశరథ్, చంద్రప్రకాష్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శివ, నరేష్, సురేష్, సుజిత్, కుమారి, లలిత, రాజ్యశ్రీ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సబితా ఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు



అత్తాపూర్: మహేశ్వరం నియోజకవర్గం నుంచి పి.సబితా ఇంద్రారెడ్డి వరుసగా విజయ పరంపర కొనసాగిస్తూ గెలుపొందారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్‌కు చెందిన జాలిగం చిత్తారి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సబితా ఇంద్రారెడ్డిని ఆమె నివాసంలో కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'మానూ'లో ముగిసిన రైస్- 2023

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 'రైస్-2023' అంతర్జాతీయ సదస్సు ముగిసింది. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సెంట్రల్ అమెరికాలోని ఎల్‌సాల్వడార్‌లోని యూనివర్సిడాడ్ డాన్ బాస్కో సంయుక్త ఆధ్వర్యంలో రెండ్రోజుల 8వ అంతర్జాతీయ సదస్సు 'కాన్ఫరెన్స్ ఆన్ ఇంటలిజెంట్ కంప్యూటింగ్ ఇన్ ఇంజినీరింగ్ (రైస్-2023) ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. హనోయ్‌లోని హనోయ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండస్ట్రీకి చెందిన డాక్టర్ బుయ్ టియోన్‌సన్ 'యూఏవీల కోసం భద్రత తాకిడి వైపు' అనే అంశంపై ప్రసంగించారు. ప్రోగ్రామ్ చైర్మన్ డాక్టర్ విజయేందర్‌కుమార్ సోలంకి, సీఎస్ అండ్ ఐటీ విభాగం కన్వీనర్, హెడ్ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ ముగింపు సమావేశంలో మాట్లాడుతూ.. రెండ్రోజుల పాటు దిగ్విజయంగా ఈ సదస్సును నిర్వహించామన్నారు. మొత్తం 106 పేపర్లలో 46 ఆమోదించబడ్డాయని, అధికారిక ప్రక్రియల కోసం 22 ఎంపిక చేయబడ్డాయన్నారు. డాక్టోరల్ సింపోజియంలో ప్రదర్శన కోసం అదనంగా 24 ఎంపిక చేయబడ్డాయన్నారు. పలువురు ప్రొఫెసర్లు ప్రసంగించారు.

కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు

రాయదుర్గం: కార్తీక మాస సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాల అనంతరం ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం చేసుకునే అవకాశం కల్పించారు.


జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని చంద్రమౌళీశ్వరస్వామి దర్శనం


గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి, షిర్డీసాయిబాబా, గణేషుడు, ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాశీవిశ్వేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అలంకరించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు 108 సార్లు రుద్రంతో ప్రత్యేక రుద్రహోమం నిర్వహించారు.
- సాయిఐశ్వర్యకాలనీలోని శివాలయం, గొలిదొడ్డిలోని శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించి స్వామివారిని అలంకరించారు.
- టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి దేవాలయంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పలు ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. ఆకాశ దీపం వెలిగించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ


ప్రకాశ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన మల్లేష్‌ముదిరాజ్, రామకృష్ణారెడ్డి, శ్రీరాములు


ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను శాలువాతో సత్కరిస్తున్న పెండ్యాల సాయి మల్లిక్

మణికొండ: రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా నాలుగవ సారి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ప్రకాశ్‌గౌడ్‌కు అభినందనల వెల్లువ నెలకొంది. ఆయన గెలుపు కొరకు కృషి చేసిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉదయం నుంచే ఆయన నివాసానికి వెళ్ళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గెలుపుకు కృషి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేసిన వారికి రాబోయే రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఇదే పట్టుదలతో రాబోయే ఎంపీ, మున్సిపల్ ఎన్నికల్లో పనిచేసి పార్టీ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పార్టీ సమన్వయ కర్త తలారి మల్లేష్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖ యాదగిరి, వైస్ చైర్మెన్ జి.వెంకటేష్‌యాదవ్, పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, పత్తి ప్రవీణ్, ఉషారాణి, మణికొండ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, కౌన్సిలర్‌లు బి.కావ్యశ్రీరాములు, పి.శైలజవినోద్, నాయకులు నీలేష్‌ప్రసాద్, బాల్‌రెడ్డి, నగేష్‌యాదవ్, రాజుయాదవ్, నాగరాజు, శ్రీకాంత్, కుమార్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను సత్కరించిన సాయి మల్లిక్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా నాలుగోసారి గెలుపొందిన టి.ప్రకాశ్ గౌడ్‌ను శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కో-ఫౌండర్ పెండ్యాల ఆదిత్య, శ్రావణ్, గోపాల్, సాయి కిరణ్, రాహుల్, దినేశ్, నరేశ్ యాదవ్, నరేశ్, ధోని, విశాల్, శోభన్, శ్రీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన వైస్ చైర్మెన్ వెంకటేష్‌యాదవ్, కౌన్సిలర్‌లు


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి, వట్టినాగులపల్లి నాయకులు


నో.. ప్రమోషన్ !

- ఎవరి పదవుల్లో వారే..
- ఎమ్మెల్యేగా ప్రకాష్‌గౌడ్
- మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్‌గా తోకల శ్రీనివాస్‌రెడ్డి
- మణికొండ మున్సిపల్ చైర్మన్‌గా నరేందర్‌ముదిరాజ్
- కార్వాన్ కార్పొరేటర్‌గా స్వామియాదవ్

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గానికి నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులంతా సిట్టింగ్ ప్రజాప్రతినిధులు పోటీ చేసిన విషయం తెలిసిందే. వారిలో సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేశారు. బీజేపీ పార్టీ నుంచి సిట్టింగ్ మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి మణికొండ మున్సిపల్ సిట్టింగ్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్, ఎంఐఎం పార్టీ నుంచి కార్వాన్ సిట్టింగ్ కార్పొరేటర్ స్వామియాదవ్‌లు పోటీ చేశారు. వారిలో ప్రకాష్‌గౌడ్ పదవీకాలం పూర్తవ్వడంతో తిరిగి ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేయగా.. మిగతా ముగ్గురు సిట్టింగ్ ప్రజాప్రతినిధులుగా ఉంటూ.. మరింత ఉన్నత స్థానమైన ఎమ్మెల్యేకు పోటీ చేశారు. ప్రకాష్‌గౌడ్ కాకుండా ముగ్గురిలో ఏ ఒక్కరు గెలిచినా.. వారి ప్రస్తుత స్థానం మారి ప్రమోషన్ పొంది ఎమ్మెల్యేగా ఎన్నికయ్యేవారు. కానీ ఓటర్లు దీనికి భిన్నంగా ఎవరి స్థానాల్లో వారే ఉండాలని నిర్ణయించినట్లైంది. ప్రకాష్‌గౌడ్ సైతం ఈసారి గెలుపొందితే నాల్గోసారి అవుతుందని, ప్రభుత్వం వస్తే తనకూ ప్రమోషన్ వచ్చి మంత్రిని అవుతానని అనుకున్నారు. తాను గెలిచి బీఆర్ఎస్ ప్రభుత్వం రాకపోవటంతో అతడికి ప్రమోషన్ లేకుండా ఉన్న స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని నియోజకవర్గ ఓటర్లు, రాజకీయ నాయకులు చర్చించుకుంటున్నారు. ఏదేమైనా ఎమ్మెల్యేగా ఓడిపోయిన ముగ్గురికి నియోజకవర్గ వారి పార్టీ ఇన్‌చార్జ్‌ల బాధ్యతలు రావడంతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మాదిరిగానే నియోజకవర్గంలోనూ ప్రతిపక్షం గట్టిగానే ఉండే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.


ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి


మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్


కార్వాన్ కార్పొరేటర్ స్వామియాదవ్

శంషాబాద్‌లో కాంగ్రెస్ నేతల సంబురాలు


సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

శంషాబాద్: రాష్ట్రంలో మెజార్టీ ఎమ్మెల్యే స్థానాలు కైవసం చేసుకుని కొత్త ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయడంతో ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి. శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీతో సుపరిపాలనకు అడుగులు పడ్డాయని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ అన్నారు. సులోచన, శ్రీధర్, శంషుద్దీన్, బొబ్బిలి కిష్టయ్య, మహేందర్ ముదిరాజ్, కోటేశ్వర్‌గౌడ్ , సిద్దేశ్వర్‌గౌడ్, గని, జహంగీర్ , పరమేష్, నర్సింహా, నర్సింగ్‌రావు, భాస్కర్‌రెడ్డి, అక్రమ్‌ఖాన్, సిద్దేశ్వర్‌గౌడ్, దయానంద్, యాదగిరి, కొంకర రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి


మాజీ కార్పొరేటర్ సాయిబాబాను సత్కరిస్తున్న మహిళా ప్రతినిధులు

రాయదుర్గం: ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ గచ్చిబౌలి డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా నాయకత్వంలో నేతలు మర్యాదపూర్వకంగా సమావేశమై భవిష్యత్తు పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయినప్పటికీ స్థానికంగా ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ఘన విజయం సాధించినా.. ఎలాంటి సమస్యలు ఉండవని పార్టీని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెడదామని నిర్ణయించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నాయకులు, కార్యకర్తలు అంతా ప్రజలకు చేరువలో ఉంటూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు డివిజన్‌లో మెజార్టీ సాధించడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ.. సాయిబాబాను ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు చెన్నంరాజు, యాదగిరి, నారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.